రిపోర్టర్లు కావలెను
అత్యంత వేగవంతంగా..
ఎప్పటికప్పుడు.. అందరికంటే
ముందుగా వార్తలు అందించేందుకు
రెండు తెలుగు రాష్ట్రాల నుంచి
రిపోర్టర్లు కావలెను
అనుభవం ఉన్నవారికి
మాత్రమే ప్రాధాన్యం
EDITOR:
G.BUCHI REDDY
8125972476

quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY తెలుగు దినపత్రిక

క్విక్ టుడే
తెలుగు దినపత్రిక
అన్ని రకాల ప్రకటనల
(అడ్వరైజ్‌మెంట్స్) కొరకు
8125972476 సంప్రదించండి
8125972476

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 102 | సోమవారం | 05-01- 2026 | వెల: 3 రూ./- | పేజీలు : 8


MALKAJGIRI | Volume: 3 | Issue: 102 | Monday | 05-01- 2026 | Price: ₹3/- | Pages: 8



# న్యూయార్క్ జైలుకు మదురో

## నార్కో టెర్రరిజం ఆరోపణలపై విచారణకు తరలింపు

### వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్



**న్యూయార్క్, జనవరి4:**
అమెరికా సైనిక దళాలు అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనం సృష్టించాయి. వెనెజువెలాలో వెనెజువెలా రాజధాని కారకాస్‌లో అత్యంత రహస్యంగా, హై-రిస్క్ ఆపరేషన్ నిర్వహించాయి. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అమెరికా డెల్టా దళాలు శనివారం అరెస్ట్ చేశాయి. వెనెజువెలాలోని ఓ సైనిక స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం వారిని యుద్ధనౌక ద్వారా న్యూయార్క్‌కు తరలించాయి. మదురోపై అమెరికా తీవ్రమైన నార్కో టెర్రరిజం ఆరోపణలు మోపింది. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, భారీ పరిమాణంలో కొకైన్‌ను అమెరికాకు తరలించారని ఫెడరల్ కోర్టులో అభియోగాలు దాఖలు చేశారు. 1999 నుంచి 2025 వరకు సాగిన ఈ అక్రమ రవాణాకు మదురో నాయకత్వం వహించారని యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బాండీ వెల్లడించారు. ఈ కేసులో

మిగతా 2లో

## నెలరోజులపాటు ఫ్రీ ఇంటర్నెట్

### స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్న ఎలాన్ మస్క్ ప్రకటన

### మదురో అరెస్ట్‌ను స్వాగతించిన మస్క్



**న్యూయార్క్, జనవరి4:**
టెస్లా, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వెనెజువెలాకు ప్రజలకు భారీ ఊరట కల్పిస్తూ కీలక ప్రకటన చేశారు. దేశంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల

మిగతా 2లో



## పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టును అడ్డుకోవాలి

### ముంబైలో సీనియర్ న్యాయ నిపుణులతో సీఎం రేవంత్

### నేడు సుప్రీంకోర్టులో బనకచర్లపై విచారణ

### బలంగా వాదించాలని ముఖ్యమంత్రి సూచన

**ముంబై, జనవరి4:**
గోదావరిపై ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సీనియర్ న్యాయ నిపుణులతో చర్చలు జరిపింది. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ

మిగతా 2లో



## అంబులెన్స్‌లో అఘాయిత్యం

### యువతిపై సామూహిక అత్యాచారం

### ఢిల్లీ సమీపంలోని ఫరీదాబాద్‌లో దారుణం

**న్యూఢిల్లీ, జనవరి4:**
దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలోని ఫరీదాబాద్‌లో జరిగిన ఓ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 25 ఏళ్ల యువతిపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆమెను నిర్ధాక్షిణ్యంగా రోడ్డుపై పడేసి అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు

మిగతా 2లో

## పాలమూరు-రంగారెడ్డిపై ప్రభుత్వం అబద్ధాలు


### హరీశ్‌రావును తిడితే సభ వాయిదా బీఆర్ఎస్ డ్రామా

### కేసీఆర్‌ను తిడితే సహించేది లేదన్న కవిత



**సూర్యాపేట, జనవరి4 (క్విక్ టుడే న్యూస్):**
పాలమూరు-రంగారెడ్డి విషయంలో అసెంబ్లీలో ప్రభుత్వం అడ్డగోలు అబద్ధాలు చెప్పిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆల్మట్టి ఎత్తు పెంపు, అప్పర్ భద్రకు జాతీయ హోదాను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే కృష్ణానది నీళ్ల అంశంపై చర్చించాలన్నారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన తెలంగాణ జాగృతి నేతల సమావేశంలో కవిత మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి, నారాయణ్‌పేట్-కొడంగల్‌కు 77.5 టీఎంసీలు

మిగతా 2లో



## తెలంగాణకు కాంగ్రెస్సే తొలి విలన్

### నీటి వాటాల పట్ల కేసీఆర్‌పై ఆరోపణలు సరికాదు

### తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజంటేషన్

**హైదరాబాద్, జనవరి4, (క్విక్ టుడే న్యూస్) :**
తెలంగాణ ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేసీఆర్ ఉదాసీనత వల్ల తెలంగాణ అన్యాయం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. నీటి వాటాలో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేసిండంటే ఎవరూ నమ్మరని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణభవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ హరీశ్‌రావు ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రాతో కలిపింది కాంగ్రెస్సే, మన విద్యార్థులను పొట్టనపెట్టుకుంది కాంగ్రెస్సే, మన ప్రాజెక్టులను రద్దుచేసింది కాంగ్రెస్సే అని ఆయన విమర్శించారు. చివరికి 11వ షెడ్యూల్‌లో కూడా

మిగతా 2లో

## నేడు హిల్ట్ పాలసీపై చర్చ

### అసెంబ్లీలో చర్చించే అవకాశం

**హైదరాబాద్, జనవరి4 (క్విక్ టుడే న్యూస్):**
అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం శాసనసభలో 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ పాలసీ(హిల్ట్)పై స్వల్పకాలిక చర్చ జరుగనున్నది. అదేవిధంగా శాసనమండలిలో పలు బిల్లులపై చర్చించ నున్నారు. డిసెంబర్ 29న అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కాగా, ఎజెండాను ముందస్తుగా ప్రకటించాల్సి ఉన్నప్పటికీ అధికారులు వెల్లడించలేదు. ప్రభుత్వ, అధికారుల పనితీరును శనివారం ఎంఐఎం శాసనస భాపక్ష నేత అక్బరుద్దీన్, పలువురు సభ్యులు తప్పుపట్టారు. దీంతో ఎట్టకేలకు అసెంబ్లీ సిబ్బంది సోమవారం ఎజెండాను ముందుగానే ప్రకటించారు.




## భారత్‌లో ఆడబోం

### టీ20 మ్యాచ్‌లపై బంగ్లాదేశ్

### శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జనవరి4:**
రాబోయే టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు వెళ్లకూడదని బంగ్లాదేశ్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ యువజన,

మిగతా 2లో

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం



### విమానంలో ప్రయాణించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

### జూన్ 26న విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు

**విజయనగరం, జనవరి4 (క్విక్ టుడే న్యూస్):**
విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి విమానం విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. ఆదివారం ఉదయం 10.15 గంటల సమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన వ్యాలిడేషన్ (టెస్ట్) ఫ్లైట్ ఇక్కడి రన్‌వేపై దిగింది. ఈ విమానంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, విజయ నగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఏటీసీ ఛైర్మన్ తదితరులు ప్రయాణించారు. అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు పనులు ఇప్పటికే 96 శాతం పూర్తయినట్లు నిర్మాణ సంస్థ జీఎంఆర్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో విమానాశ్రయాన్ని జూన్ 26న అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు వేగవంతం చేశారు. ఈ టెస్ట్ ఫ్లైట్ విజయవంతం కావడంతో త్వరలోనే ఈ ప్రాంతం నుంచి విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

తరువాయి పేజీ..



## తెలంగాణకు కాంగ్రెస్సే తొలి విలన్

పాలమూరు, దిండి ప్రాజెక్టులను పెట్టకుండా పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణభవన్‌లో పీపీటీ ఇస్తూ హరీశ్‌రావు ఈ కామెంట్స్ చేశారు. హరీశ్‌రావు కామెంట్స్ ఆయన మాటల్లోనే.. 'తెలంగాణ ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. మన ప్రాంతాన్ని ఆంధ్రాతో కలిపింది కాంగ్రెస్. మన విద్యార్థులను పొట్టన పెట్టుకుంది కాంగ్రెస్. మన ప్రాజెక్టులను రద్దుచేసింది కాంగ్రెస్. చివరికి 11వ షెడ్యూల్‌లో కూడా పాలమూరు, దిండి ప్రాజెక్టులను పెట్టకుండా పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు అన్యాయం చేసింది కాంగ్రెస్. ఇంక సోనియాగాంధీ రక్షణలు కల్పించిందని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నడు. ఏం రక్షణలు కల్పించింది..? పాలమూరు, దిండి ప్రాజెక్టులను 11వ షెడ్యూల్‌లో పెట్టకపోవడం రక్షణనా, నీటి పంపకాలు సెక్షన్ 3 ప్రకారం చేయాలని చెప్పకపోవడం రక్షణనా..?' అని ప్రశ్నించారు. 'తెలంగాణ ప్రాంతానికి నాడైనా, నేడైనా నెంబర్‌వన్ విలనే కాంగ్రెస్ పార్టీ' అని కేసీఆర్ చెప్పిన మాటలు అక్షర సత్యమని ఇయ్యాల తేలిపోయింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కృష్ణా ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పజెప్తం అంటడు. కృష్ణానదీ జలాల్లో అతితక్కువ వినియోగం చేస్తరు. ఇప్పుడు గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై లోపాయికారిగా ఒప్పందం చేసుకుంటరు' అని హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు.

## అంబులెన్స్‌లో అఘాయిత్యం

నిందితులను పట్టుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ విచారణలో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఓ ప్రైవేట్ ఆసుపత్రి అంబులెన్స్‌లో నిందితులు ఈ నేరాన్ని చేసినట్లు విచారణలో తేలింది. ఈమేరకు సీనియర్ దర్యాప్తు అధికారి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, 25ఏళ్ల యువతి సోమవారం సాయంత్రం ఫరీదాబాద్‌లోని సెక్టార్ 23లో ఉన్న తన స్నేహితురాలిని కలిసేందుకు వెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చి వాహనం కోసం ఎదురుచూస్తుండంగా ఇంతలోనే ఓ వ్యాన్ అక్కడికి వచ్చింది. అందులో ఇద్దరు వ్యక్తులు ఇంటి వద్ద దిగబెడతామంటూ యువతిని నమ్మించి వాహనంలోకి ఎక్కించుకున్నారు. అయితే, ఆమెను తన ఇంటి వద్ద దింపకుండా వారు గురుగ్రామ్ వైపు వాహనాన్ని మళ్లించారు. కదులుతున్న వాహనంలోనే ఆమెపై అత్యాచారం చేసినట్లు సమాచారం. ఆమెను రాత్రంతా వాహనంలో తిప్పి, మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఫరీదాబాద్‌లోని రాజా చౌక్ సమీపంలో వ్యాన్‌లో నుంచి బయటకు విసిరేశారు. ఈ ఘటన జరిగిన ఆరు రోజుల తర్వాత కూడా ఆ మహిళ ఆసుపత్రిలోనే చికిత్స పొందుతోంది. ఈ ఘాతుకానికి పాల్పడ్డ ఆ ఇద్దరిని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మధుర, ఝూన్సీకి సంబంధించిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. దీంతో వారిద్దరిని జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. దర్యాప్తులో భాగంగా ఈ ఘటనకు సంబంధించి ఒక కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులు ఈ నేరాన్ని వ్యాన్‌లో కాకుండా ఒక ప్రైవేట్ ఆసుపత్రి అంబులెన్స్‌లో చేసినట్లు తెలిసింది. నిందితుల్లో ఒకరు ప్రైవేట్ ఆసుపత్రి అంబులెన్స్‌లో డ్రైవర్, మరొకరు హెల్పర్‌గా పనిచేసేవారని ఒక సీనియర్ దర్యాప్తు అధిరి తెలిపారు. కాగా ఈ ఘటన తర్వాత బాధితురాలికి సంబంధించిన వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. అందులో తనపై జరిగిన దాడి గురించి స్పష్టంగా తెలిపింది. ఇంటికి వెళ్లేందుకు ఎదురుచూస్తున్న తనకు లిఫ్ట్ ఇస్తామని నమ్మించి వాహనంలోకి ఎక్కించుకున్నారని చెప్పింది. ఆ తర్వాత నిందితుల్లో ఒకరు తన ఖాతాలో రూ.600 జమ చేశారని ఆమె వివరించింది. "నాకు వారు ఇంతకు ముందు తెలియదు. నేను కారులో కూర్చోగానే, వారిలో ఒకరు నా పేటీఎం ఖాతాకు రూ.600 బదిలీ చేశారు. ఆ తర్వాత వారు కారును లాక్ చేసి నా మొబైల్‌ను లాక్కున్నారు. రాత్రి దట్టమైన పొగమంచు ఉంది. నేను గట్టిగా అరిచాను, కానీ సహాయం లభించలేదు" అని ఆమె ఆ వీడియోలో చెప్పింది. బాధితురాలు కోలుకున్న తర్వాత నిందితులను మరోసారి పరేడ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

## భారత్‌లో ఆడబోం

క్రీడల శాఖ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ అధికారికంగా వెల్లడించారు. ఇటీవల కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసిన బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను.. బీసీసీఐ సూచనల మేరకు జట్టు నుంచి తప్పించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో, ముస్తాఫిజుర్‌ను భారత్‌లో ఆడనివ్వకూడదని పలువురు డిమాండ్ చేయడంతో బీసీసీఐ ఈ చర్య తీసుకున్నట్లు తీసుకున్నట్లు సమాచారం. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అత్యవసర సమావేశం నిర్వహించి, భారత్ పర్యటనను బహిష్కరించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా ఆసిఫ్ నజ్రుల్ ఫేస్‌బుక్ ద్వారా స్పందిస్తూ.. "భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న దూకుడు విధానాల వల్లే మేము ఈ నిర్ణయం తీసుకున్నాం. కాంట్రాక్టు ఉన్న ఆటగాడికే అక్కడ అనుమతి లేనప్పుడు, మా జాతీయ జట్టుకు అక్కడ రక్షణ ఉంటుందని మేము భావించడం లేదు" అని పేర్కొన్నారు. తమ ఆటగాళ్ల భద్రత దృష్ట్యా ఫిబ్రవరిలో కోల్‌కతా, ముంబై వేదికగా జరగాల్సిన బంగ్లాదేశ్ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి లిఖితపూర్వకంగా కోరతామని ఆయన తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 7 నుంచి 17 మధ్య బంగ్లాదేశ్.. వెస్టిండీస్, ఇటలీ, ఇంగ్లాండ్, నేపాల్‌లతో ఆడాల్సి ఉంది. మరోవైపు, బంగ్లాదేశ్ క్రికెట్‌ను, క్రికెటర్లను అగౌరవపరిస్తే సహించేది లేదని స్పష్టం చేసిన నజ్రుల్.. బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారాలను తక్షణమే నిలిపివేయాలని సమాచార ప్రసారాల శాఖను ఆదేశించారు.

# న్యూయార్క్ జైలుకు మదురో

మదురో భార్య, కుమారుడితో పాటు పలువురు ఉన్నతాధికారుల పేర్లను కూడా చేర్చారు. ప్రస్తుతం మదురో న్యూయార్క్‌లోని ఫెడరల్ జైలులో ఉన్నారు. మదురో అరెస్ట్ నేపథ్యంలో వెనెజువెలా సుప్రీంకోర్టు ఆదివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశ పరిపాలనలో అంతరాయం కలగకుండా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను తాత్కాలిక అధ్యక్షురాలిగా నియమించింది. దేశ సమగ్రత, పరిపాలనా కొనసాగింపునకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు పేర్కొంది. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనెజువెలాలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. కరాకస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.



# పాలమూరు-రంగారెడ్డిపై ప్రభుత్వం అబద్ధాలు

కేటాయిస్తే, 40 టీఎంసీలకే ఎందుకు అంగీకరించారని కవిత ప్రశ్నించారు. పాలమూరు ప్రజలకు రేవంత్‌రెడ్డి చేస్తున్న అన్యాయాన్ని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. హరీశ్‌రావును తిడితే సభను వాయిదా వేసుకొని వెళ్లిపోవటం బీఆర్ఎస్ డ్రామా అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ బాయ్ కాట్ హరీశ్‌రావు నిర్ణయమా? బీఆర్ఎస్ పెద్దల నిర్ణయమా అని గట్టిగా ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ నిర్ణయమైతే చరిత్రలో క్షమించరాని తప్పు చేసినట్లేనని చెప్పారు. అసెంబ్లీలో మాట్లాడే అవకాశం వదిలి బయట సభలు పెట్టి ప్రజలకు ఏమి వివరిస్తారని విమర్శించారు. తెలంగాణకు 3 శాతం నీళ్ల వాటా తగ్గించే ఒప్పందంపై హరీశ్ రావు సంతకం చేశారా? లేదా అని అడిగారు. అలాగే జూరాల నుంచి శ్రీశైలంకు ఇన్ టేక్ పాయింట్‌ను ఎందుకు మార్చారో సమాధానం చెప్పాలని కల్వకుంట్ల కవిత కోరారు. కేసీఆర్‌ను టెర్రరిస్ట్‌తో పోల్చితే నేనే రియాక్ట్ అయ్యాను, బీఆర్ఎస్ నుంచి ఎవరూ ఎందుకు స్పందించలేదన్నారు. సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి అనుచరులు ఆలయాలను, చెరువులను కూడా వదలలేదని ఆరోపించారు. అడ్డగోలుగా అవినీతి చేసిన వారిపై నేను మాట్లాడుతూనే ఉంటానని హెచ్చరించారు.





## పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టును అడ్డుకోవాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముంబైలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం తరపున సమర్థమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా న్యాయ నిపుణులకు సూచించారు. అవసరమైన అన్నిఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేశారు. అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు లింక్ చేసేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. తక్షణమే పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఈ పనులు ఆపేలా సుప్రీంకోర్టు ఆదేశించాలని పలు అంశాలను ప్రస్తావించింది. మొదట్లో ఆమోదించిన మేరకు పోలవరం ప్రాజెక్టు పనుల స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కావని ఆ పిటిషన్‌లో స్పష్టం చేసింది. తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ–ఫీజిబులిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించటం సమంజసం కాదని అభ్యంతరం తెలిపింది. అందుకు సంబంధించి కేంద్ర జలసంఘం, కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ, గోదావరి నీటి యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం డీపీఆర్ తయారీకి సిద్ధపడుతోందని, వెంటనే ఈ చర్యలను ఆపాలని కోరింది. ఏపీ తలపెడుతున్న ఈ విస్తరణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా, కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొంది.

## నెలరోజులపాటు ఫ్రీ ఇంటర్నెట్

నేపథ్యంలో, ప్రజలకు నిరంతరాయంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించేందుకు నెల రోజుల పాటు స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. వెనిజులా ప్రజలకు మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో వెల్లడించారు. అమెరికా సైనిక చర్యలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో పట్టుబడిన కొద్దిసేపటికే మస్క్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. మదురో అరెస్ట్‌ను స్వాగతించిన మస్క్, ఆయన పాలన ముగియడంతో ఇకనైనా వెనిజులా అభివృద్ధి పథంలో పయనించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. "వెనిజులా ఇప్పుడు శ్రేయస్సును పొందగలదు" అని స్పానిష్ భాషలో వ్యాఖ్యానించారు. లో–ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ల ద్వారా పనిచేసే స్టార్‌లింక్ నెట్‌వర్క్, దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఈ సమయంలో కనెక్టివిటీ సమస్యలు లేకుండా చూస్తుంది. ఫిబ్రవరి 3 వరకు ఈ ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయి. మదురో ప్రభుత్వంపై మస్క్ మొదటి నుంచి తీవ్ర విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన స్పందన ఎవరినీ ఆశ్చర్యపరచలేదు. మదురో ప్రభుత్వ విధానాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని ఆయన చాలాకాలంగా ఆరోపిస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో ప్రతిపక్షానికి బహిరంగంగా మద్దతు పలికిన మస్క్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ప్రతిపక్ష నేత మారియా కొరినా మచాడోకు అండగా నిలిచారు. సహజ వనరులు పుష్కలంగా ఉన్న వెనిజులా, సరైన నాయకత్వం లేకపోవడం వల్లే అభివృద్ధికి దూరమైందని మస్క్ గతంలో పలుమార్లు పేర్కొన్నారు.

